20న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెద్దపల్లి, జూన్11: ఈనెల 20న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే ఆరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 20న 1–19ఏండ్ల లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని 706 అంగన్ వాడీ కేంద్రాలు , ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2, 27, 251 మంది 1 –19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. 20న వివిధ ఇతర కారణాలతో తప్పిపోయిన వారికి ఈ నెల 27న పంపిణీ చేయాలన్నారు. అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో కే ప్రమోద్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, డీపీవో ఆశాలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి జే రంగారెడ్డి, షెడ్యూల్ తరగతుల సంక్షేమ అధికారి నాగలేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి రాజగోపాల్, సీడీపీవో కవిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మ్యాదరికండిలో చెరువు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మారం,జూన్11: మండలంలో సాగు నీటి నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. కొత్తపల్లి శివారులోని మ్యాదరికండి వద్ద నూతనంగా చేపట్టనున్న చెరువు నిర్మాణ ప్రదేశాన్ని నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇక్కడ చెరువు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులు,అధికారులతో మాట్లాడారు. నిధుల విడుదలకు పరిపాలన మంజూరు కోసం సీఎం, మంత్రులను కలుస్తానని తెలిపారు. బొమ్మారెడ్డిపల్లి శివారు నుంచి కొత్తపల్లి వరకు ఎస్సారెస్పీ డీ83/బీ 1ఎల్ కాల్వ విస్తరణకు సంబంధించి కాల్వ తవ్వకం చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు సాగునీటిని అందించటానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.అనంతరం లక్ష్మణ్ కుమార్ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. నిర్వహించి సమస్యల పరిష్కారం పై దిశా నిర్దేశం చేశారు. వివిధ గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన వెంట తహసీల్దార్ రజిత, ఇరిగేషన్ ఈఈ సుధాకిరణ్, డీఈఈ రమేశ్, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ట్రాన్స్‌కో ఏఈ ఎండి ఖాసీం, మిషన్ భగీరథ ఏఈ అజీమొద్దిన్,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో 'ఆవిష్కృత్-2024'

ఈవెంట్స్ ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

రామగిరి, జూన్ 11: స్థానిక జేఎన్ టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆవిష్కృత్–2024 పేరిట టెక్ ఫెస్టివల్‌ను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే సాంకేతిక పండుగకు కళాశాలను ముస్తాబు చేశారు. మొదటిరోజున విద్యార్థుల కేరింతల నడుమ నాన్ టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించారు. ఇతర కళాశాలలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. టెక్నికల్ ఈవెంట్స్‌లో మోడల్ మేకింగ్, పీపీటీ, డ్రోన్ అసెంబ్లింగ్, సర్వేయింగ్, కాంక్రీట్ డిజైన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, కోడ్ కింగ్, రిలే కోడ్, మేజ సిల్వర్, టెక్‌టానింగ్ మెమ్స్, సబ్‌స్టేషన్ ఎక్స్‌పో, ఎక్స్‌ప్లోరింగ్, క్విజ్, మైన్ ఎక్స్‌పోరియో, జియో ఓరియల్, ప్రహేలిక లాంటి వాటిని ఏర్పాటు చేశారు. ఈఈఈ విభాగ అధిపతి దుర్గారావు కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా మైనింగ్ అధిపతి శర్మ, డీఈఈ సతీశ్, సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలన అధికారి సుమన్, అధ్యాపకులు, స్టూడెంట్ కో–ఆర్డినేటర్స్ మేఘన, వశిష్ట, సింధురెడ్డి, మానస, కౌశిక్, చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఖని బస్టాండ్‌ను ఆధునీకరించాలని వినతి

గోదావరిఖని, జూన్ 11: గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునీకరించి ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మంత్రి చొరవతో త్వరలోనే రూ. 35 కోట్లతో రామగుండం లో బీసీ సంక్షేమ భవనం ఏర్పాటు కానుందని తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తే నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణీకుల వల్ల కొంత ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులను పెంచుతామని, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేస్తామని, 35 కోట్లతో త్వరలోనే బీసీ సంక్షేమ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

మంథని, జూన్ 11: గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొని అరెస్టు చేసినట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంథని పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు కేసు వివరాలను మంగళవారం రాత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్ఐ వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు దుబ్బాసి రమేశ్, లూకాలు మంథని డిపో ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన చకినారపు సంతోష్, మంథనిలోని సత్యసాయినగర్‌కు చెందిన పుల్ల ప్రశాంత్ ప్లాస్టిక్ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వద్ద పంచనామా చేశారు. నిందితుల నుంచి 1.70 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బంది రమేశ్, లూకాలను ఏసీపీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూన్11: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, వ్యాయా ఉపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యున్నతికి ప్రణాళికబద్ధంగా ముందుకు పోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించాలని, గతంలో కంటే కనీసం 10 శాతం అదనంగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలని ఆదేశించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, ప్రతిరోజు పాఠశాలలో టీచర్ల హాజరుపై నివేదిక సమర్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. విద్యార్థులను చదువుతో పాటు ఆటల్లోనూ ప్రోత్సహించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ తప్పనిసరిగా స్పోర్ట్స్ పీరియడ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల ఎత్తు, బరువు, ఫిట్‌నెస్ అంశాలకు సంబంధించి ప్రాథమిక నివేదిక సమర్పించాలని సూచించారు. వారానికో రోజు యోగా పీరియడ్ ఉండేలా చూడాలనారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచే లంచ్ అండ్ లెర్న్ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఎక్కడైనా చిన్న పొరపాటు జరిగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేరెంట్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మీటింగ్‌లో ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీఈవో డీ మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్, హెచ్‌ఎంలు, పీఈటీలు, అధికారులు, పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంకు ఎంపికైన రాగినేడు జడ్పీహెచ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి రంగు కీర్తనను కలెక్టర్ అభినందించారు. కరాటే పోటీల్లో సుల్తానాబాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఈ అభినయ్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి జీ హర్షవర్ధన్, ఓదెల కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు జే సిరి చందన, ఎం కీర్తన, కే శ్రీహర్ష ఎన్ సహస్ర, బీ శ్రీనిధి పతకాలు సాధించారు. గత నెల 13న నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్‌లో ఇండియన్ స్పేస్ రీచార్జ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఆధ్వర్యంలో నిర్వహించిన యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం యువిక –2024కు ఎంపికై రంగు కీర్తన, రాగినేడు జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం చాట్ల ఆగయ్య, పీఈటీ శ్రీనివాస్, గైడ్ టీచర్ జగదీశ్వర్ రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు.

రఘువీర్‌సింగ్ మంచి మనసు

- **జూలపల్లి గ్రంథాలయ నిర్వహణకు సొంత భవనం అప్పగింత**

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రఘువీర్ సింగ్

జూలపల్లి, జూన్ 11: పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మంచి మనసును చాటుకున్నారు. జూలపల్లిలో గ్రంథాలయ శాఖ నిర్వహణ కోసం అద్దె భవనం అందుబాటులో లేక పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుం డడంతో చూసి చలించిపోయారు. పక్కా భవనం నిర్మించే దాకా గ్రంథాలయ నిర్వహణకు తన సొంత భవనాన్ని అప్పగిస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు పెద్దపల్లిలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జూలపల్లిలో లైబ్రరీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

గత సర్కారు నిధులిచ్చినా అడ్డుకున్న ఆనాటి ప్రతిపక్షాలు

1986 నుంచి నైజాం కాలంనాటి కచేరీ, తర్వాత సింగిల్ విండో ఆఫీసుగా మారిన భవనంలోనే పదేండ్ల నుంచి గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో వ్యవసాయ శాఖ, సింగిల్ విండో, గ్రంథాలయం నడుస్తుండడం ఇబ్బందిగా మారింది. గ్రంథాలయం ఖాళీ చేయాలని ఆయా శాఖల సిబ్బంది తరచూ ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు రీడింగ్ గదిలోనే ఎరువులు, విత్తనాలు నిల్వ చేస్తుండడంతో పాఠకులు ఆరుబయటే చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో గ్రంథాలయ సొంత భవన నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కార్ పాలనలో రెండు విడుతలుగా రూ.45 లక్షల నిధులు మంజూరు చేసింది. దాదాపు ఆరేండ్ల కిందట భవనం నిర్మాణం కోసం పంచాయతీ పాలక వర్గం సభ్యులు తీర్మానించి స్థలం కేటాయించారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే అప్పటి పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు పనులకు అడ్డుతగిలి కోర్టులో కేసు వేయగా వివాదంగా మారింది. ఏదిఏమైనప్పటికీ గ్రంథాలయం నిర్వహణకు రఘువీర్‌సింగ్ చొరవతో భవనం సమస్య తీరడంతో పాఠకుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, జూన్11 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం గంగారంలో బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎం లు, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రసీదు ఇవ్వాలి

పెద్దపల్లి, జూన్11: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి విత్తన డీలర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు విత్తన, ఎరువులు ఏవో కే అలివేణితో కలిసి తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విత్తన డీలర్లు తప్పకుండా రసీదు ఇవ్వాలని, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనాల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లో అధిక రేట్లకు విత్తనాలు విక్రయించవద్దని సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లు, విక్రయదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిషన్‌భగీరథ పనులపై ఇంటింటా సర్వే

ముత్తారం, జూన్ 11: మండలంలోని ఇప్పలపల్లిలో మిషన్‌భగీరథ పనులపై ఇంటింటా సర్వే చేసినట్లు ఎంపీడీవో జీ లలిత తెలిపారు. నల్లా కనెక్షన్ల వివరాలు నమోదు చేసుకున్నారు. ఇక్కడ ఎంపివో వేణుమాధవ్, కార్యదర్శ నరేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూన్ 11: పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ పథకం పనుల వివరాలు నమోదు చేసుకుంటూ సర్వే చేస్తున్నారు. పలు గ్రామాలను ఎంపివో సుదర్శన్ సందర్శించి సర్వేపనులు జరుగుతున్న తీరు ను పరిశీలించారు. కార్యదర్శులు రవి ఉన్నారు.

గుండె పోటుతో మహిళా ప్రయాణికురాలు మృతి

కాల్వశ్రీరాంపూర్, జూన్11: ముత్తారం మండలంలోని లక్కారం గ్రామ పరిధిలోని కాశీపల్లెకు చెందిన జంగ మణెమ్మ(57) మంగళవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ గుండె పోటుకు గురై మృతి చెందింది. గోదావరిఖని నుంచి జమ్మికుంటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లో మణెమ్మ తన స్వగ్రామమైన కాశీ పల్లె లో బస్సు ఎక్కింది. తన కోడలు లతతో బస్సులో ప్రయాణిస్తూ కాల్వశ్రీరాంపూర్‌లోని బంధువుల ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యంలో మణెమ్మ అస్వస్థతకు గురైంది. కండక్టర్ గమనించి కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి మణెమ్మ అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మణెమ్మ మృతి చెందినట్లు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త రాజిరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పెద్దపల్లి టౌన్, జూన్11: తాగునీటి సమస్యను పరిష్కరించాలని పెద్దపల్లిలోని 10వ వార్డు లక్ష్మీనగర్ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సి వస్తుందని వాపోయారు. నూతనంగా నిర్మించుకున్న ఇండ్లకు మిషన్ భగీరథ, మున్సిపల్ మంచినీటి పంపుల కనెక్షన్లు బిగించాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోశం, ప్రధా న కార్యదర్శి వేణుగోపాల్, వర్కింగ్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, సభ్యులు సుగుణాకర్ రావు, బాపు గౌడ్, మదర్ ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ

జ్యోతినగర్, జూన్ 11: ఎన్టీపీసీ రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారును లారీ ఢీకొంది. వివరాల్లోకి వెళ్లితే రామగుండం బీ పవర్ మీదుగా గోదావరిఖనికి విచ్చేస్తున్న కారును వెనుకాల నుంచి ప్రమాదవశాత్తు లారీ క్రషర్‌నగర్ ఏరియాలో ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కుటుంబ సభ్యులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనా స్థలానికి చేసుకున్న ఎన్టీపీసీ పోలీసులు రోడ్డుపై నిలిచిన కారు, లారీని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియోరెన్స్ చేశారు.

మంథని ఎంపీవో సరెండర్

మంథని, జూన్ 11: మంథని ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్‌పై వేటు పడింది. తమను వేధింపులకు గురిచేస్తున్నాడని మండలంలోని కార్యదర్శులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. కాగా జడ్పీ సీఈవో నరేందర్ విచారణ జరిపి నివేదికను సమర్పించారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఎంపీవో ను పంచాయతీరాజ్ కమిష నర్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరెపల్లె విద్యార్థి ప్రతిభ

రితిక్

కాల్వశ్రీరాంపూర్, జూన్11: మహాత్మా జ్యోతి బాపూలే నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఆరెపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎం రితిక్ 73 మార్కుసాధించారు. జిల్లా టాపర్‌గా నిలిచినట్లు హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆరో తరగతిలో సీటు సాధించిన రితిక్ ను పలువురు అభినందించారు

రేషన్ బియ్యం స్వాధీనం

సుల్తానాబాద్ రూరల్, జూన్ 11 : మండలంలోని దేవునిపల్లిలో బేడ బుడగ జంగాల కాలనీలో మంగళవారం సివిల్ సప్లై అధికారులు రేషన్ బియ్యం పట్టుకున్నారు. అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. నంబయ్య అనే వ్యక్తి దాదాపు 236 క్వింటాల రేషన్ బియ్యం కాలనీలో నిల్వ చేశారనే సమాచా రం మేరకు అధికారులు కాలనీలో తనిఖీలను నిర్వహించారు. అక్రమంగా ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న బియ్యంను సుల్తానాబాద్ రైస్ గోదాముకు తరలించారు. ఇందులో డీఏస్‌వో ప్రమ్‌కుమార్, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్, డీటీలు శంకర్, రవీందర్ రాథోడ్, మల్లి కార్జున్ రావు, శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

దాతలకు సత్కారం

కోల్‌సిటీ, జూన్ 11: గోదావరిఖని లక్ష్మీనగర్‌లో ప్రజల దాహం, ఆకలి తీర్చడం కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ, పులిహోర వితర కేంద్రానికి సహకరించిన దాతలను మంగళవారం సన్మానించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసి వివిధ అవసరాల నిమిత్తం మార్కెట్‌కు వచ్చే వారి ఆకలి తీర్చేందుకు పులిహోర, మజ్జిగను పంపిణీ చేశారు. 60 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దాతలను సత్కరించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ క్యాస శ్రీనివాస్, కృష్ణమూర్తి, పల్లెర్ల సంతోష్, కోలేటి రవీందర్, ముత్తారం రవి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

జ్యోతినగర్(రామగుండం), జూన్ 11: రామగుండం మండల పరిధిలోని 660 మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని లబ్ధిదారులు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాది మార్చి 16న డ్రా పద్ధతిలో తమను ఎంపిక చేశారని, పట్టాలు అందజేయాలని వారు కోరారు.

13మంది సీఐల బదిలీలు

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 11: మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీపీ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్ని శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పోలీసు శాఖలో బదిలీల పక్రియ ప్రారంభమైంది. డీసీఆర్‌బీ నిర్మల్ సీఐ ఎం నైయిల్ బైంసా రూరల్ సర్కిల్‌కు, బైంసా రూరల్ సర్కిల్ సీఐ ముస్కం శ్రీనివాస్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. డీఎస్‌బీ నిర్మల్ సీఐ ఎం ప్రవీణ్‌కుమార్ నిర్మల్ పట్టణ ఠాణాకు, నిర్మల్ టౌన్ సీఐ బీ అనిల్ రామగుండం, గోదావరిఖని –2కు బదిలీ అయ్యారు. వీఆర్ నిజామాబాద్ అటాచ్ టూ ఐజీపీ కంట్రోల్ రూమ్‌కు సీఐగా ఉన్న బత్తుల సత్యనారాయణను ఇల్లందు బీ కొత్తగూడెంకు, ఇల్లందు బీ కొత్తగూడెం సీఐ టీ కరుణాకర్ మల్టీజోన్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా కోరారు. సీఎస్‌బీ 3 ఖమ్మం సీఐ కే సతీశ్‌ను పాల్వంచ పట్టణ ఠాణాకు, పాల్వంచ టౌన్ సీఐ వీ వినయ్‌కుమార్ మల్టీజోన్ ఐజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని సూచించారు. సీఎస్‌బీ 4 రామగుండం సీఐ జీ రమేశ్‌బాబును రామగుండం టాస్‌ఫోర్స్ 1లో ఎక్సిటింగ్ వెకెన్సీగా బదిలీ చేశారు. డీటీసీ ఖమ్మం సీఐ పీ వెంకన్న వరంగల్ కమిషనరేట్ ఎక్సిటింగ్ వెకెన్సీగా, మల్టీజోన్‌లో వెయిటింగ్‌లో ఉన్న సీఐ కే దామోదర్‌ను వరంగల్ కమిషనరేట్‌లో ఎక్సిటింగ్ వెహికన్సీగా, ఎం రమేశ్‌ను సీసీఎస్ 1నిజామాబాద్ ఎక్సిటింగ్‌గా బదిలీ అయ్యారు. రాబోయే రోజుల్లో మరిన్ని బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

'కేశోరాం'లో ఎన్నికలు వాయిదా

పాలకుర్తి, జూన్11: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి బీ డానియల్ ప్రకటించారు. సోమవారం సాయంత్రం కార్మికులతో ఎన్నికల నిర్వహణకు సమావేశమై, షెడ్యూల్ ప్రకటించిన యాజమాన్యం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇప్పటికే గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసిందని, కావాలని వాయిదా వేశారని పర్మనెంట్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయుడు కౌశికహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల వాయిదాను రద్దు చేయాలని హెచ్ఆర్ వైస్‌ప్రెసిడెంట్ పార్థసారథిని డిమాండ్ చేశారు. ఇరువర్గాలతో యాజమాన్యం సుదీర్ఘంగా చర్చించిన యాజమాన్యం స్పందించలేదు. అనంతరం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నికలు నిర్వహించాలని కోరగా హెడ్డాఫీసు నుంచి సమాచారం వచ్చేవరకు సాధ్యం కాదని పేర్కొన్నారు. మంగళవారం నామినేషన్లు వేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు సిద్ధ పడగా, ఎన్నికలు వాయిదాపడటంతో కార్మికులు, నాయకులు నిరాశచెందారు.

దరఖాస్తులు తీసుకోవాలి

కోల్‌సిటీ, జూన్ 11: ఎన్నికల కోడ్ ముగిసినా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు ఎందుకు తీసుకోవడం లేదని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేశ్ ప్రశ్నించారు. ఈమేరకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను కలిసి విన్నవించారు. నగర పాలక సంస్థ పరిధిలో గతంలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోగా కొందరిని మాత్రమే లబ్ధిదారులుగా చేర్చారని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరణ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అర్హులు ఈ పథకానికి దూరమయ్యారని వివరించారు. ఇప్పటికైనా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకొని అర్హులకు ఈ పథకం వర్తింప జేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కే రాజారత్నం, గంగారపు ప్రసాద్ తదితరులున్నారు.

అధికారికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 11 : సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1 బేస్ వర్కషాప్ ఇన్‌చార్జీగా పని చేస్తూ ఈ అండ్ఎం జీఎం బదిలీపై వెళ్తున్న ఏలీషాను వర్క్‌షాప్ ఉద్యోగులు సన్మానించారు. మంగళవారం బేస్‌వర్క్‌షాప్‌లో ప్రాజెక్టు ఇంజనీర్ ఆర్. శ్రీనివాస్ అధ్యక్షతన ఆయనకు అధికారులు, ఉద్యోగులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఏఈ రఘుకుమార్, హెచ్ఓడీ జీవీ సత్యనారాయణ, ఉదయ్ భాస్కర్, జ్ఞానేశ్వర్, కార్మిక సంఘల నాయకులు నక్క రమేశ్, జక్కుల దామోదర్‌రావు, ఎ. శ్రీనివాస్, సుధాకర్, కాంతాల కిషన్ రెడ్డి, పంజాల వెంకటేశ్వర్లు, పీ రవీందర్ రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

కొత్త లైబ్రరీ నిర్మాణానికి కృషి

కాల్వశ్రీరాంపూర్, జూన్11: మండల కేంద్రంలో కొత్త లైబ్రరీ నిర్మాణానికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ అధికారి ఏవీఆర్ రాజు అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఏవీఆర్ రాజు మంగళవారం సందర్శించారు. గ్రంథాలయంలోని సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. పాఠకులు ఆయనకు వినతి పత్రం అందించారు. బుధవారం నుంచి 8 నుంచి సాయంత్రం 11గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు గ్రంథాలయం తీసి ఉంటుందని చెప్పారు. నూతన గ్రంథాలయ నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ప్రభుత్వం రూ. 23లక్షలు మంజూరు చేసిందన్నారు. శిధిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని తొలగించి, కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు.

రైస్ మిల్లర్లతో కుదిరిన వేతన ఒప్పందం

సుల్తానాబాద్, జూన్ 11: రైస్ మిల్లర్స్, ఆపరేటర్ల మధ్య వేతన ఒప్పందం కుదిరింది. మంగళవారం స్థానిక రైస్ మిల్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైస్ మిల్లు ఆపరేటర్స్ యూనియన్ (సీఐటీయూ), సుల్తానాబాద్ రైస్ మిల్లు ఓనర్స్ అసోసియేషన్‌కు మధ్య వేతన ఒప్పందం చర్చలు ముగిశాయి. ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ. 2500 ఆపరేటర్లకు పెంచాలని, గతంలో ఉన్న బోనస్, పీఎఫ్, సర్వీస్‌పే, బట్టలు యధావిధిగా కొనసాగించాలని, ఈ ఒప్పందం తేదీ 17 మే 2024 నుంచి 16 మే 2026 వరకు అమలులో ఉంటుందని ఒప్పంద తీర్మానం జరిగింది. ఈ చర్చల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తాండ్ర అంజయ్య, నౌండ్ల బ్రహ్మచారి, ఓనర్స్ అసోసియేషన్. జిల్లా అధ్యక్షులు. తిరుపతి రెడ్డి. అసోసియేషన్ అధ్యక్షులు. ఎర్రవెల్లి పురుషోత్తమరావు. కార్యదర్శి. విజయ్ పాల్ రెడ్డి. కేశవరావు. రమేష్. సత్తయ్య. అర్జున్ రావు. గోపాల్ రావు. శ్రీనివాసరెడ్డి. ప్రసాద్ . లతోపాటు రైస్ మిల్ ఆపరేటర్స్ పాల్గొన్నారు

ఎన్ఆర్ఐ ఆపన్నహస్తం

ధర్మారం,జూన్11: కొత్తూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ (కెనడా) కొలుముల దామోదర్ యాదవ్ ఓ అనారోగ్య బాధితురాలికి ఆర్థికం సాయం చేసి ఆదుకున్నాడు. చామనపల్లి గ్రామానికి చెందిన మాటేటి భాగ్యలక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చేరింది. భాగ్యలక్ష్మి నిరుపేద కావడంతో చికిత్స ఖర్చు భరించలేని స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నది. ఆమె బంధువులు ఆర్థిక సాయం కోసం ఎన్ఆర్ఐ దామోదర్ యాదవ్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి విజ్ఞప్తి చేశారు.అట్టి వినతిపై స్పందించిన సదరు ఎన్ఆర్ఐ తన ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు పంపించారు. ఆ డబ్బులను మంగళ వారం నిమ్స్ దవాఖానలో బాధితురాలి భర్త మాటేటి స్వామికి ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు అందజే శారు. సాయం అందించిన ఎన్ఆర్ఐ దామోదర్ యాదవ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

- **మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

మంథని, జూన్ 11: మంథని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 4300 మంది రైతుల నుంచి 3,70,831.20 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంథని పీఏసీఎస్ కార్యాలయంలో యాసంగి ధాన్యం సేకరణ వివరాలను వెల్లడించారు. మంథని మండలంలో మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.81.36కోట్ల వ్యాపారం చేశామని వెల్లడించారు. ధాన్యం కొనుగోలుకు సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీసీవో శ్రీమాల, పౌర సరఫరాల శాఖ డీఎం, డీసీఎస్‌వో, సహకార శాఖ మానిటరింగ్ అధికారి ముఫాసిర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, రైతులు, హమాలీలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘ కార్యదర్శి అశోక్‌కుమార్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ–వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (''బంగారు రుణ సౌకర్యం'') తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/ హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేదీ:22 జూన్ 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ–వేలం సమయం) ఇ–వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర. సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	కోరుట్ల సి2387 టిజి	XXXXXXXXXXX3060	కుందనగిరి నిఖిల్ కుమార్	49388.63	15–మార్చి–24	13.5	12.2
2	సిరిసిల్ల KRN టిజి	XXXXXXXXXXX0786	సిరిసిల్ల KRN టిజి	49319	15–మార్చి–24	13.5	11.8
3	పెద్దపల్లి	XXXXXXXXXXX1167	యెల్లంకి ఆకాష్	132690	04–మే–24	32.9	31.3
4	రామగుండం	XXXXXXXXXXX7779	పిన్నోజు వంశీ	56978	04–మే–24	13.4	13.1
5	కరీంనగర్	XXXXXXXXXXX7084	కూకట్ల మహేష్	91306	04–మే–24	22.7	22.2

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.
అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్